ఘనంగా బాలల దినోత్సవం

పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజున జరుపుకుంటున్న ఈ వేడుకల సందర్భంగా.. ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. స్కూళ్లలో నిర్వహించిన స్వయం పరిపాలనా దినోత్సవ కార్యక్రమాల్లో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఝాన్సీలక్ష్మీబాయి, గాంధీజీ, సరస్వతిదేవి తదితర స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల వేషధారణలతో చిన్నారులను అలరించారు. కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: నర్సాపురం పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ వైద్యశాలలో పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సుమన్ ప్రవీణ్


భద్రాచలంటౌన్: వివిధ వేషధారణల్లో లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల చిన్నారులు


చంద్రుగొండ: ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో చిన్నారి


దమ్మపేట: అంకంపాలెం పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు


ములకలపల్లి: ఉపాధ్యాయుల వేషధారణలో తిమ్మంపేట స్కూల్ చిన్నారులు


బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో బాలల దినోత్సవం..


మణుగూరురూరల్: ఎక్సలెంట్ హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో చిన్నారులు..


మణుగూరుటౌన్: బ్రైట్‌మైండ్స్ ప్లే స్కూల్‌లో విద్యార్థుల వేషధారణలు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్‌పోటీల్లో ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన విద్యార్థిని ప్రతిభ చాటింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి, డీపీవీ స్కూల్‌కు చెందిన అశ్వారావుపేట విద్యార్థిని కేశిబోయిన భవ్య శ్రీలక్ష్మి పాల్గొంది. ఆమె రాష్ట్ర స్థాయిలో 51 స్థానాన్ని సాధించగా, నిర్వాహకులు మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా భవ్య శ్రీలక్ష్మిని ఎంపీ బండి పార్థసారథిరెడ్డి తదితరులు అభినందించారు.

కార్తీక పూజలు

అన్నపురెడ్డిపల్లి: కార్తీక మాసం ప్రారంభం కావడంతో మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామివారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే పూజాది కార్యక్రమాలు కొనసాగాయి.

చర్ల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని రైస్‌పేటలో గల శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం, చర్లలోని శ్రీ ఉమారామ లింగేశ్వరాస్వామి దేవాలయం, సత్యనారాయణపురంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి కలివేరులోని స్వయంబూ ఉమా రామ లింగేశ్వరాలయాల్లో ఉదయం నుంచే పలు పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఆదివాసీలకు విద్య, వైద్యం అందించాలి

చర్ల: ఉచిత పథకాలు అవసరం లేదని ఆదివాసీలకు విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలను కల్పించాలని, అటువంటి వారికే ఆదివాసీలు ఓట్లు వేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశవాపురంలో మంగళవారం జరిగిన పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలు ప్రత్యేకమైన సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ నమ్మిన సిద్ధాంతాల కోసం పని చేస్తారని అన్నారు. సమావేశంలో జీఎస్పీ నాయకులు తుర్రం శ్రీకృష్ణ, తుర్రం కోటేష్, కల్లూరి నాగరాజు, తుర్రం వెంకన్న, తుర్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన ఆరేళ్ల చిన్నారి మురికిపూడి యన్విత తలసేమియాతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులకు గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారి తండ్రి నాగరాజుకు గౌతమీనగర్ కాలనీలో రూ.10 వేలు సహాయంగా అందజేశారు. మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న చవిటిగూడెం గ్రామానికి చెందిన ఎ.సత్యనారాయణకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితుడి ఇంటికి వెళ్లి రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, ఈ.నారాయణరాజు, ఏ.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దమ్మపేట: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి ఎస్.గణేష్ పరిశీలించారు. మంగళవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన.. మండల అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, దమ్మపేట తహసీల్దార్ మహమ్మద్ ముజాహిద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, సీఐ కరుణాకర్, ఎస్సై రవి కుమార్, సెక్టార్ అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న గణేష్

కొనసాగుతున్న ప్రచార పర్వం

చర్ల: శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి శాసన సభకు పంపిస్తే భద్రాచలం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని భద్రాచలం నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన పర్యటనలో అయన మాట్లాడారు. మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ నాయకులు మచ్చా రామారావు, బందెల చంటి పామారు బాలాజీ, పొడుపుగంటి సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలో జోన్ కమిటీల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారంగా చేయగా.. కార్యక్రమంలో రమేష్ మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక, సున్నం గంగ, భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు పాల్గొన్నారు.

చర్ల: చర్ల మండలంలోని ఉంజుపల్లి సమీపంలో గల అటవీ ప్రాంత గ్రామాల్లో భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు.

ములకలపల్లి: బీజేపీ బలపర్చిన అశ్వారావుపేట జనసేన అభ్యర్థి ముయ్యబోయిన ఉమాదేవిని గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని భక్త అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రచారరథానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, వీరన్న, రామక్రుష్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: భద్రాచలం రాకుండా గోదావరి అవతలి ఒడ్డు నుంచే ఎన్నికల ప్రచారం నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకుడు కేసీఆర్‌కు భద్రాచలం ప్రజలను ఓట్లను ఏ మోహంతో అడుగుతారని మిత్రపక్ష కూటమి నాయకులు ప్రశ్నించారు. మంగళవారం భద్రాలచంలో జరిగిన సమావేశంలో మిత్ర పక్ష కూటమికి చెందిన కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హామీలన్ని తప్పుడు హామీలేనని విమర్శించారు. సమావేశంలో ఆయా పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఓటు వేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొమరం దామోదరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సీతారాంపురం గ్రామంలో మండల కమిటీ సమావేశం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. కెల్లావేణు, పాతూరి ప్రసాద్, దండుగుల రాధాకృష్ణ, మట్టావీరయ్య, కొల్లి గోవిందం, కొడాలి సుబ్బారావు పాల్గొన్నారు.

బూర్గంపాడు: కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి వేగవంతమవుతుందని పినపాక నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పొడియం బాలరాజు అన్నారు. మంగళవారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీపథం అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు ప్రదర్శనలు


ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం మంగళవారం పలు గ్రామల్లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. గత ఎన్నికల్లో 70 శాతం కంటే తక్కువగా నమోదైన పోలింగ్ శాతం గ్రామాలైన అశ్వారావుపేట మండలంలోని నందిపాడు, దురదపాడు, వడ్డెర రంగాపురం, వినాయకపురం, వినాయకపురం కాలనీ, వడ్డెర కాలనీలో ఎంసీసీ నోడల్ అధికారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కళా ప్రదర్శనలు నిర్వహించారు. కళా ప్రదర్శనల ద్వారా ఓటు ప్రాధ్యానత, ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామస్తులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలి


ములకలపల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న జారె ఆదినారాయణ

ములకలపల్లి: మాయమాటలతో గద్దెనెక్కి, రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసిన బీఆర్‌ఎస్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధిచెప్పి, తెలంగాణను ప్రకటించిన కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆపార్టీ అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి జారె ఆదినారాయణ కోరారు. మండలపరిధిలోని పాతగంగారాం, ముత్యాలంపాడు, రాచన్నగూడెం, జగన్నాథపురం కమలాపురం, సీతాయిగూడెం జీపీల్లోని పలుగ్రామాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జారె మాట్లాడుతూ.. తాను ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సైతం వదిలి, ప్రజాసేవ చేస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల అభ్యున్నతే తన లక్ష్యమని వెల్లడించారు. తొలుత జగన్నాథపురానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అడపా నాగేశ్వరరావు, సతీశ్, సురేశ్, సొసైటీ ఉపాధ్యక్షుడు పూర్ణచందర్‌రావులను జారే ఆదినారాయణ కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీతాయిగూడెం, పాతగంగారం సర్పంచ్‌లు కారం సుధీర్, వాడే నాగమణి, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజి, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌టీపీ, సీపీఐ, టీజేఎస్ మండల బాధ్యులు తాండ్ర ప్రభాకర్‌రావు, తేళ్ల చెన్నయ్య, సోయం కృష్ణ, కందుకూరి రాంబాబు, యూసఫ్, సాధం శ్రీను పాల్గొన్నారు.

తాతా మధు వ్యాఖ్యలు గర్హనీయం

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణపై కేసీఆర్ సభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతామధు చేసిన అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణకు మద్దతుగా కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ పార్టీల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జారే విధేయుడిగా ఉన్నాడే కానీ బానిస కాదని పేర్కొన్నారు. తాతా మధు వ్యాఖ్యలకు త్వరలోనే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పానుగంటి సత్యం, రావు గంగాధర్ రావు, చిన్నశెట్టి యుగంధర్, ఎర్రగొర్ల రాధాకృష్ణ, చామర్తి గోపి శాస్త్రి, యార్లగడ్డ భాస్కర్ రావు, కెవి.సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రార్థనలు

చంద్రుగొండ: కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణ గెలుపొందాలని కోరుతూ మండలకేంద్రం చంద్రుగొండలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం మసీదులు, చర్చీలు, దేవాలయాల్లో ప్రార్థనలు, పూజలు చేశారు. తొలుత మసీదులో, చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, ముస్లిం మతపెద్దలు యండి.ఖాజాహుసేన్, అహెమద్ పాల్గొన్నారు.

పాయంను మెజారిటీతో గెలిపించాలి


కాంగ్రెస్‌లో చేరిన వారితో పాయం వెంకటేశ్వర్లు


ప్రచారంలో భాగంగా పిండి వంటలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రంలో బుడుగుబజార్, కాలువ బజార్‌తో పాటు పలు కాలనీల్లో మంగళవారం ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు వివరించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి పాయంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, నాయకులు ఓరుగంటి రమేష్, చంద్రకళ, సదర్‌లాల్, ఎస్‌కే.గాలిబ్, వలబోజు మురళి, చిగురుపాటి ప్రసాద్, భద్రారెడ్డి, వరప్రసాద్, శశికాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మారోజు కృష్ణమాచారి, బీజేపీ నాయకుడు సురకంటి గంగారెడ్డి మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి, పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొండబత్తుల ఉపేందర్, పాములుగారు, తోట నాగయ్య, పులసాని రామిరెడ్డి, కందిమళ్ల రాంరెడ్డి, పర్వత నరేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు, మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలైన మామిళ్లవాయి, గుట్టబోరు, పాలవాగు గ్రామాల్లో 76 కుటుంబాలు పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని వాసు, వంకా సత్యనారాయణ, లక్ష్మణస్వామి, చలమల సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9 మందికి రిమాండ్

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 9 మంది నిందుతులను ఎస్సై షాహీన మంగళవారం అదుపులోనికి తీసుకుని కొత్తగూడెం కోర్టుకి తరలించగా.. కోర్టు వారు వారందరినీ రిమాండ్‌కు పంపారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద గత నెల 25వ తారీకున రెండు వర్గాలు మధ్య జరిగిన ఓ ఘర్షణను అడ్డుకునేందుకు వెళ్లిన ఇద్దరు పోలీసులపై.. ఈ తొమ్మిది మంది దురుసుగా ప్రవర్తించినట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామ చివారులో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై కేశవరావు స్టేషన్ సిబ్బందితో కలిసి నర్సాపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఈ ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. వీరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 30 లీటర్ల నాటుసారా లభ్యమైంది. స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. నిందితులు గుండివారిగుడెంకు చెందిన మలోత్ రామపతి, బొడ రాంబాబుగా తేలినట్లు ఎస్సై తెలిపారు.

సహకార వారోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గుంపెన ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం భవనం వద్ద పీఏసీఎస్ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించారు. అనంతరం మండలంలో సహకార సంఘం ఆధ్వర్యంలో గుంపెన, ఊటుపల్లి, నామవరం, అన్నపురెడ్డిపల్లి, తెలిజెర్ల, అబ్బుగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆస్పత్రి సిబ్బందికి వితరణ

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి ఏఎస్సై వైవీవీ సత్యనారాయణ యూనిఫాం, బూట్లు అందించారు. మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శైలేందర్ చేతుల మీదుగా ఆస్పత్రి సిబ్బందికి సరఫరా చేశారు.

ఎన్నికల కోఆర్డినేటర్‌గా విజయలక్ష్మి

అశ్వాపురం: ఇల్లెందు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోర్డినేటర్‌గా మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పోరెడ్డి విజయలక్ష్మి నియమితుయ్యారు.

ప్రజా ఆశీర్వాద సభ చరిత్రాత్మకం


సమావేశంలో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గం బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ చారిత్రాత్మకమైందని, ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో జన సందోహం తరలివచ్చిందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, మండల అధ్యక్షుడు ముత్యంబాబు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: పినపాక బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు గెలుపును కాంక్షిస్తూ.. ఆయన సతీమణి రేగా సుధారాణి గౌతమీనగర్ కాలనీలో శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో మంగళవారం పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తోకల లత, ఎంపీటీసీ కందుల దుర్గాభవాని పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామంలో మంగళవారం బూత్ ఇన్‌చార్జ్ నక్కనబొయిన పాపారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావు గెలుపును కాంక్షిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, ఉపసర్పంచ్ చందూలాల్ పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం అందించడమే లీగల్ సర్వీసెస్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ వేశాధారణలో ఉన్న ఓ బాలుడికి జడ్జి ప్రేమగా పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియన్ న్యాయవాదులు అవులూరి సత్యనారాయణ, పేరాల వెంకటేశ్వర్లు, పామరాజు తిరుమలరావు, సంకా నర్మద, ఎంవి.రమ, భాషం శారద, లీగల్ ఎయిడ్ లాయర్ దాట్ల సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపారావు, కోలపూడి ప్రసన్న, ఇతర అధ్యాపకులు, మండల్ లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఉబ్బల ప్రవల్లిక పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాల విద్యార్థులకు నోడల్ అధికారి సమ్మయ్య ఆధ్వర్యంలో ఓటు హక్కుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు ఒక వజ్రాయుధమని, దానితో ప్రజాస్వామ్య పరిరక్షిణతో పాటు దేశ భవిష్యత్‌ను కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సహాయ నోడల్ అధికారి వీర్రాజు, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు..

భద్రాచలం పట్టణంలోని మానవ సేవ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఓటు హక్కుపై జిల్లా ఎన్నికల నోడల్ అధికారిణి స్వర్ణలత మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకోలేని వృద్ధులు, వికలాంగులకు కల్పిస్తున్న సదుపాయలు, నడవలేని వారి కోసం ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ, రఫీ తదితరులు పాల్గొన్నారు.